బల్కంపేట్ ఎల్లమ్మకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ పూజలు

చిక్కడపల్లి, మే 19 : బల్కంపేట్ ఎల్లమ్మ అమ్మవారిని ఆదివారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మల్కిరెడ్డి ముకుంద్‌రెడ్డి దంపతులు, ముచ్చకుర్తి ప్రభాకర్, శంకర్ ముదిరాజ్, చాణిక్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రసంగిస్తున్న నవమి పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌అలీషా, చిత్రంలో జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ శ్రీవత్స కోట,

అబిడ్స్, మే 19 : ప్రకృతి వైపరీత్యాలను అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని డాక్టర్ ఉమర్ అలీషా సూచించారు. మధురానగర్‌లో విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం వైశాఖ మాస పర్యటన సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ శ్రీవత్స కోట, రిటైర్డ్ డిస్ట్రిక్ట్ జడ్జి నాగమారుతి శర్మ, గిడుగు రామ్మూర్తి, వేమూరి లక్ష్మి, రామావతారం, దాసరి శ్రీనివాసుతో పాటు పీఠం ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఆలీషా మాట్లాడుతూ.. అధ్యాత్మికతను దిక్సూచిగా మార్చుకుని ఈ సంసార జీవితంలో వచ్చే కష్టాలు, ఒత్తిడులను అధిగమించాలని తెలిపారు. ప్రకృత వైపరీత్యాలను అరికట్టాలంటే ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలని కోరారు. జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ శ్రీవత్సకోట మాట్లాడుతూ.. తల్లి దండ్రులను నిర్లక్షం చేయకూడదని, దైవ సమానంగా చూడాలని కోరారు. భారతదేశ విశిష్టతను భావితరాలకు అందించాలని కోరారు.

'ఓం శ్రీసాయిరాం' బాధితులకు న్యాయం చేయాలి

- ఫైనాన్స్ యజమాని సాయిబాబాను తక్షణమే అరెస్టు చేయాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్

బాధితులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య

రవీంద్రభారతి, మే 19 : ఓం శ్రీసాయిరాం ఫైనాన్స్ బాధితులకు ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని, లేకపోతే ఎమ్మెల్యేలను, మంత్రులను గ్రామాల్లో తిరగనివ్వమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు(రాజ్యసభ సభ్యుడు)ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆర్. కృష్ణయ్య బాధిత ప్రజలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాలకు చెందిన 50 గ్రామాల ఎస్సీ, ఎస్టీ, బీసీ పేదలను ఓం శ్రీసాయిరాం ఫైనాన్స్ కంపెనీ అధిక వడ్డీ ఆశ చూపి నట్టేట ముంచిందని, దాదాపు రూ.150 కోట్లు పేదల సొమ్మును ఫైనాన్స్ యజమాని సాయిబాబా దోచుకున్నారని ధ్వజమెత్తారు. పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయిన రైతులకు గత ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం డబ్బులను ఓం శ్రీసాయిరాం ఫైనాన్స్ యజమాని సాయిబాబా బాధిత ప్రజలను నుంచి అధిక వడ్డీ ఆశ చూపి రూ.150 కోట్లు తీసుకున్నారని ఆర్.కృష్ణయ్య తెలిపారు. కొన్ని నెలల తరువాత అవసరాల కోసం బాధిత ప్రజలు డబ్బులు ఇవ్వాలని సాయిబాబాను అడుగగా రేపిస్తా.. మాపిస్తా.. అని ప్రజలను మభ్య పెట్టారని పేర్కొన్నారు. బాధితులు దబాయించి అడుగగా 'నా దగ్గర డబ్బులు లేవని, మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి' అని బాధితులను బెదిరించాడని తెలిపారు. ఈ విషయంపై బాధితులు పోలీసులకు, రాజకీయ నాయకులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆయన ధ్వజమెత్తారు.

సీఎం తక్షణమే స్పందించాలి..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి బాధితులకు డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని ఆర్. కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. ఫైనాన్స్ యజమాని సాయిబాబాను పోలీసులు అరెస్టు చేసి అతని పేరుమీద ఉన్న బీనామీ ఆస్తులను జప్తు చేసి బాధితులకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయకుంటే మంత్రులు, ఎమ్మెల్యేల ఇంటిముందు బాధితులతో కలిసి ధర్నా నిర్వహిస్తానని ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఆయన వెంట 50 గ్రామాల బాధిత ప్రజలు ఉన్నారు.

ట్యాంక్‌బండ్‌పై కర్పూరి విగ్రహం ఏర్పాటు చేయాలి

సమావేశంలో పాల్గొన్న.. అసోసియేషన్ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్, మే 19 : భారత రత్న అవార్డు గ్రహీత కర్పూరి ఠాగూర్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని, ఈ విషయమై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవిస్తామని భారతరత్న కర్పూరి ఠాగూర్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ కన్వీనర్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం హనుమాన్‌టేక్డీలోని బీసీ సాధికారత భవన్‌లో అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యలో ప్రోత్సాహాన్ని అందిస్తున్నామన్నారు. ఇటీవలే ఉద్యోగ విరమణ పొందిన సుధాకర్ దంపతులను, పదోన్నతి పొందిన ఏసీపీ సురేశ్, వినోద్‌కుమార్ తదితరులను మెమెంటోలతో రిటైర్డ్ జడ్జి టి. గోపాల్‌సింగ్ సన్మానించారు. సమావేశంలో వ్యాపారవేత్త ప్రభాకర్, అసోసియేషన్ ప్రతినిధులు మురళీమోహన్, లక్ష్మణ్‌రావు, భవాని శంకర్, లక్ష్మీనారాయణ, వినోద్, జానయ్య, సంతోష్, సురేశ్, నరహరి, నాగరాజు, వరంగల్ ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

అబిడ్స్, మే 19 : చారిత్రాత్మకమైన గుడిమల్కాపూర్‌లోని శ్రీ ఝూంసింగ్ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 24న ప్రారంభమై 30 వరకు కొనసాగుతాయని ఆలయ ఈఓ కృష్ణారావు తెలిపారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ డాక్టర్ వినయ్‌కుమార్‌సింగ్ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. 24 నుంచి రోజూ పూజలు జరుగుతాయని ఈ నెల 28న శ్రీవారి తిరుకల్యాణోత్సం అదే రోజు రాత్రి శ్రీవారి దివ్య బ్రహ్మ రథోత్సవ కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించనున్నట్లు వివరించారు. బ్రహ్మోత్సవాలకు తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోనున్నట్లు ఈఓ తెలిపారు.

ఎరుకల నాంచారమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

యాదాద్రి జిల్లా భువనగిరి ఫిలాయిపల్లిలో 21వ తేదీ నుంచి 3 రోజుల పాటు జరగనున్న ఎరుకల నాంచారమ్మ జాతర పోస్టర్‌ను ఆదివారం తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్‌రెడ్డి నగరంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ ఎరుకల సంఘం నాయకులు కూరాకులు కృష్ణ, ప్రధాన కార్యదర్శి మల్లేశ్, రఘు, వెంకటేశ్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం మే 19

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్ బాపునగర్‌లో ఉన్న సెయింట్ ఆంథోని పాఠశాల 2007 వ సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్ జసింతా, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు శశిధర్ రెడ్డి, సాయిరాజ్, ఇ.వివేకానంద, బి.వివేకానంద, దేవ్‌రాజ్, మానస తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం మే 19

పద్మారావుగౌడ్‌కు సన్మానం



బీఆర్‌ఎస్ నాంపల్లి కార్యాలయంలో పద్మారావుగౌడ్‌ను సన్మానిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి సీహెచ్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మెహిదీపట్నం మే 19 : నాంపల్లి నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జి సీహెచ్ ఆనంద్‌కుమార్‌గౌడ్ కలిశారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్‌లో బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేయించడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో కృషి చేశారని పద్మారావుగౌడ్ అభినందించారు. అనంతరం పద్మారావుగౌడ్‌ను ఆనంద్‌కుమార్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ కోఆర్డినేటర్ ప్రదీప్‌కుమార్ అగర్వాల్, ప్రియాంకగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిశంకరాచార్య జయంతి ఉత్సవాలు

ఉత్సవాలను ప్రారంభించిన విశ్రాంత జస్టిస్ కాశీవిశ్వేశ్వరావు

ముషీరాబాద్, మే 19: చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా ఆదివారం జగద్గురు ఆదిశంకరాచార్య జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో విశ్రాంత జస్టిస్ కాశీవిశ్వేశ్వరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. అద్వైత వేదాంత సిద్ధాంతాన్ని ప్రచారం చేసిన గొప్ప తత్వవేత్త ఆది శంకరాచార్య అని కొనియాడారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాట్యగురువు ఎస్‌పీ భారతి, ఉష, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

25న అన్నమాచార్య జయంతి ఉత్సవాలు

అంబర్‌పేట, మే 19 : 32 వేల సంకీర్తనలు రచించిన తాళ్లపాక అన్నమాచార్య జయంతి ఉత్సవాలను ఈ నెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ వసుధామూరి తెలిపారు. హైటెక్‌సిటీ, మాదాపూర్‌లోని శిల్పారామంలో సాయంత్రం 5 గంటల నుంచి జరిగే ఈ ఉత్సవాలకు నటుడు, మోటివేషన్ స్పీకర్ కేవీ ప్రదీప్, యాంకర్ సరస్వతి ప్రదీప్, డాన్సర్, నటీ ఆశ్రిత వేముగంటి నండూరి, మ్యూజిక్ డైరెక్టర్ డాక్టర్ జ్యోశ్యభట్ల తదితరులు అతిథులుగా విచ్చేస్తున్నారని చెప్పారు. ఆలిండియా రేడియో, దూరదర్శన్ కళాకారుడు లక్ష్మణమూర్తి పర్యవేక్షణలో 100 మందికిపైగా అన్నమయ్య కీర్తనల్లో ప్రత్యేకంగా శిక్షణ పొందుతున్నారన్నారు. వంద మంది విద్యార్థులు పాటలు పాడుతుంటే శాలిని అమరనేని, కనకహర్షిణి కూచిపూడి నృత్యరూపకం ఉంటుందని ఈవెంట్ మేనేజర్లు నందిని, యామిని ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 8374927736 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అన్నమయ్య గొప్ప వాగ్గేయకారుడు

బుల్లితెర నటుడు నరేశ్‌ను అవార్డుతో సత్కరిస్తున్న వక్తలు

రవీంద్రభారతి, మే 19 : శ్రీ తాళ్లపాక అన్నామాచార్యుడు గొప్ప వాగ్గేయకారుడని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్త అన్నారు. ఆదివారం భారత్ ఆర్ట్స్, అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని ప్రధాన వేదికపై శ్రీ తాళ్లపాక అన్నామాచార్య 616వ జయంతి వేడుకలు, అన్నమయ్య నృత్య హేళ, పలువురి నాట్యగురువులకు అభినవ నర్తకి, గాన శిఖరం, నాట్య కౌస్తుభ అవార్డుల బహూకరణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఏబీసీ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లలితారావు సభా అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్త, బుల్లి తెర నటుడు నరేశ్, ప్రముఖ నృత్య గురువు పసుమర్తి శేషుబాబు విచ్చేసి అన్నామాచార్య 616 జయంతి వేడుకలను ప్రారంభించారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా అభినవ నర్తకి, గాన శిఖరం, నాట్యకౌస్తుభ అవార్డులను నాట్యగురువులకు బహూకరించారు. కార్యక్రమంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లయన్ లలితారావు, నటుడు అనిల్ ఆనంద్, మా అసోసియేషన్ కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ పద్మిని పాల్గొన్నారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మెహిదీపట్నం, మే 19 : విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

8 నుంచి 9 గంటల వరకు..

ఆసిఫ్‌నగర్ విద్యుత్‌సబ్‌డివిజన్ పరిధిలోని 11 కేవీ నీలోఫర్ హాస్పిటల్ ఫీడర్ నీలోఫర్ హాస్పిటల్, లక్డీకాపూల్, ఏసీగార్డ్స్, సలీం ఫంక్షన్‌హాల్, నాంపల్లి పోలీస్ స్టేషన్, టౌన్ ప్లానింగ్ కార్యాలయం, ఎన్నికల కమిషనర్ కార్యాలయం, మున్సిపల్ కమిషనర్ కార్యాలయం, గంగా జమున హోటల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదు.

ఉదయం 10 నుంచి 11 గంటల వరకు..

11కేవీ శాంతినగర్ ఫీడర్ ఇంపీరియల్ గార్డెన్, మొఘల్ ఏజెన్సీ, మోర్ సూపర్ మార్కెట్, శాంతినగర్, విజయ్‌నగర్ కాలనీ, లక్ష్మీనగర్, పీఎస్‌నగర్, పోలీస్ క్వార్టర్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదు.

మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు..

11 కేవీ నవోదయ కాలనీ ఫీడర్ హుడా కాలనీ, అలీనగర్, ప్రియా కాలనీ, జయానగర్, నవోదయ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదు.

సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు..

11 కేవీ అంబాగార్డెన్ ఫీడర్ సంతోష్‌నగర్, ఎస్‌బీఐ కాలనీ, అంబాగార్డెన్, గుడిమల్కాపూర్, క్రాంతినగర్, జీవన్ కల్యాణ్‌నగర్, హిల్ కాలనీ, హుడా కాలనీ, సాయిగార్డెన్స్, విజయ్ సుశీల్ అపార్టుమెంట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదు.

ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు..

11 కేవీ మెహిదీపట్నం కేబుల్ ఫీడర్ హిల్ కాలనీ, వీవీ కాలనీ, ఎల్ఐసీ కాలనీ, ఎంఐజీహెచ్, దిల్‌షాద్‌నగర్, క్రాంతినగర్, అంబా థియేటర్, ఇన్‌కంటాక్స్ కాలనీ, రామ్మూర్తి కాలనీ, మెహిదీపట్నం బస్ డిపో ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదు.

ఉదయం 11 గంటల నుంచి 11.30 వరకు..

11 కేవీ మెహిదీపట్నం ఓవర్‌హెడ్ ఫీడర్ రేతిబౌలి, ఫుడ్ వరల్డ్, మిడ్ వే కాలనీ, జి.పుల్లారెడ్డి కాలేజ్, సంతోష్‌నగర్, మెహిదీపట్నం, వివేకానంద కాలనీ, జాన్‌దార్ నగర్, ఆర్‌ఎస్ బ్రదర్స్, చందనా బ్రదర్స్, చెన్నయ్ షాపింగ్ మాల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ పేర్కొన్నారు.

ఆజామాబాద్ డివిజన్‌లో...

ముషీరాబాద్ : ఆజామాబాద్ డివిజన్ 11కేవీ బసంత్‌కాలనీ, సీపీఎల్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆజామాబాద్ ఏడీఈ ఎం. విజయభాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం 10 నుంచి 11గంటల వరకు..

బసంత్‌కాలనీ ఫీడర్ పరిధిలోని లింగంపల్లి, వైశ్య హాస్టల్, బసంత్ కాలనీ, వెంకటరమణథియేటర్, జైన్‌మందిర్, కాచిగూడ ఎక్స్ రోడ్ పరిసరాల్లో విద్యుత్ నిలిపివేస్తారు.

మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల వరకు..

సీపీఎల్ ఫీడర్ పరిధిలోని పటేల్‌నగర్, పటేల్ వాడ, సీపీఎల్ క్వార్టర్స్, ప్రేమ్‌నగర్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తారు.

మల్టీస్కిల్స్ ఉన్నవారే అత్యున్నత శిఖరాలకు..

చిక్కడపల్లి, మే 19 : మల్టీస్కిల్స్ ఉన్నవారు మాత్రమే ఏరంగంలోనైనా రాణిస్తారని ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాట్స్)అధ్యక్షుడు నూతి బాపయ్యచౌదరి అన్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో ఉత్తర అమెరికా తెలుగు సంఘం సహకారంతో అవని ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. నూతన టెక్నాలజీని అందుకుంటే యువతకు మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అనంతరం కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాట్స్ డల్లాస్ కోఆర్డినేటర్ రవి తాండ్ర, రామానందతీర్థ, గ్రామీణ యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కిశోర్‌రెడ్డి, స్పర్శ ఫౌండేషన్ సీఈవో పంచముఖి, సీనియర్ జర్నలిస్ట్ కొండూరు వీరయ్య, తెలంగాణ బుక్ ట్రస్ట్ కార్యదర్శి కోయ చంద్రమోహన్ ఏఐటీయూసీ నాయకులు బాలకాశి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌హిల్స్‌లో నాంపల్లి ఎమ్మెల్యే పర్యటన

మెహిదీపట్నం, మే 19 : ప్రజల అభివృద్ధి కోసం బస్తీలు, కాలనీల్లో పర్యటిస్తున్నామని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. ఆదివారం రెడ్‌హిల్స్ డివిజన్ ఏసీ గార్డ్స్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో చర్చించారు. అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ, మే 19 : గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శంషాబాద్ రైల్వేస్టేషన్‌లో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(50) శంషాబాద్ రైల్వేస్టేషన్‌లో కొన్ని రోజులుగా అనారోగ్యంగా ఉంటూ శనివారం రాత్రి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడు ఆకుపచ్చ రంగు చొక్కా, బూడిద రంగు ప్యాంట్ ధరించి, 5.4 అడుగుల ఎత్తు ఉన్నట్లు పేర్కొన్నారు. కాచిగూడ రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

- ఘనంగా తిరు కల్యాణోత్సవం
- సామూహిక కుంకుమార్చనలు

స్వామివారి తిరు కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సుల్తాన్‌బజార్, మే 19: దేవునికుంటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా వేంకటేశ్వరస్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకించి, పూజలు నిర్వహి స్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసశర్మ తెలిపారు. ఆదివారం ఉదయం ఆరు గంటలకు నిత్యారాధనతో పూజలు ప్రారంభమయ్యాయి. అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దెత్తున పాల్గొని కుంకుమార్చనలో పాల్గొన్నారు. సాయంత్రం శ్రీస్వామి తిరు కల్యాణ మహోత్సవాన్ని సుబ్రహ్మణ్య శర్మ, మధుసూదన శర్మ మంత్రోచ్చారణలతో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం ఉదయం పది గంటలకు మహా పూర్ణాహుతి, అపబృథ స్నానం, అమ్మవార్ల ఉత్సవ మూర్తుల పల్లకి సేవ ఊరేగింపును దేవునికుంట వేంకటేశ్వర స్వామి దేవస్థానం నుంచి విజయనగర్ కాలనీలోని గణపతి దేవాలయం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ తెలిపారు.

సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

'అమాయకులపై కేసులు పెట్టొద్దు'

అమాయకులపై కేసులు పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్ ఖాద్రి అన్నారు. ఆదివారం హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఓ గొడవ విషయంలో పోలీసులు అమాయకులను పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారని సమాచారం అందగానే ఎమ్మెల్సీ రహమత్‌బేగ్ ఖాద్రి, నాయకుడు జాఫర్‌ఖాన్‌తో కలిసి హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ దక్షిణ, పశ్చిమ మండలం అదనపు డీసీపీ అష్వాక్ అహ్మద్‌తో చర్చించారు. అనంతరం గొడవపై విచారణ చేపట్టి అసలు వ్యక్తులను పట్టుకోవాలని కోరారు.

– మెహిదీపట్నం, మే 19

పరామర్శ

నామం రాజును పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట, మే 19 : పార్లమెంట్ ఎన్నికలకు ముందు రోడ్డుప్రమాదంలో గాయపడి ఇంట్లో చికిత్స పొందుతున్న బీజేపీ సీనియర్ కార్యకర్త నామం రాజును కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా.ఎన్.గౌతంరావు, కార్పొరేటర్ వై.అమృతతో కలిసి నల్లకుంటలోని అతడి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

నేడు ఎస్పీ శైలజకు జీవన సాఫల్య పురస్కారం

రవీంద్రభారతి, మే19: హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సుస్వరవాహిని కళా సాంస్కృతిక సంస్థ సోమవారం రవీంద్రభారతిలో ప్రముఖ సంగీత దర్శకుడు కే చక్రవర్తి జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రముఖ గాయకురాలు ఎస్పీ శైలజకు అందజేయనున్నట్లు సుస్వరవాహిని సంస్థ ఫౌండేషన్ ప్రెసిడెంట అమీన్ పాష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

తొలితరం కమ్యూనిస్టు ఉద్యమ నేత సుందరయ్య

ప్రసంగిస్తున్న హైకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ ఎస్.మురళీధర్

నివాళులర్పిస్తున్న వివేక్, తదితరులు

చిక్కడపల్లి, మే 19 : కమ్యూనిస్టు ఉద్యమానికి తొలితరం నేత పుచ్చపల్లి సుందరయ్య.. అని ఒరిస్సా హైకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది జస్టిస్ డాక్టర్ ఎస్.మురళీధర్ అన్నారు. ఆదివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్‌వీకే ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ స్మారకోపన్యాసం 'రాజ్యాంగ ప్రజాస్వామ్యం భావ ప్రకటనా స్వేచ్ఛ నేటి వాస్తవాలు అంశంపై జస్టిస్ మురళీధర్ ప్రసంగించారు. సుందరయ్య ధనిక కుటుంబంలో పుట్టినా పేదల కష్టాలను, సమస్యలను తీర్చడంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి, ఎస్వీకె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్. వినయ్‌కుమార్, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో పుచ్చపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం సుందరయ్య పార్కులోని ఆయన విగ్రహం వద్ద వాకర్స్ నివాళులర్పించారు. క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్. వివేక్, బి. వెంకటేశ్, స్వామిగౌడ్ మాట్లాడారు. నాగభూషణం, మాజీ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, కిషన్‌రావు, రవికుమార్, సాగర్‌రెడ్డి, రాఘవరెడ్డి, మనోహర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నారాయణ, ఆంజయ్య, స్కైలాబ్ బాబు, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

పురస్కార గ్రహీతలతో కవి డాక్టర్ ఎంకే రాము

ముషీరాబాద్, మే 19: శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య జయంతిని పురస్కరించుకొని ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో నిర్వహించిన సంగీత, నాట్యోత్సవాలు విశేషంగా అలరించాయి. పలువురు చిన్నారుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రముఖ కవి డాక్టర్ ఎంకే రాము పాల్గొని నృత్యకారులను సత్కరించి పురస్కారాలు అందజేశారు. గాయని శ్రీమణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య, పండిట్ అంజుబాబు, దామోదరం నాగేందర్, నాట్యగురువులు మధుమణి, మోహన్, రాజేశ్, సౌమ్య, పుష్ప, కీర్తి, సుధారాణి, అంజన్‌సాయివర్మ, ఎంవీ సుబ్రహ్మణ్యం, శిఖరం ఆర్ట్ థియేటర్స్ స్థాపక కార్యదర్శి జి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.